# బౌద్ధధర్మ దర్శిని

భదంత ఆనంద కౌసల్యాయన్



అనువాదం

జె. లక్ష్మిరెడ్డి

# బౌద్ధధర్మ దర్శిని

హిందీ మూలం

**భదంత ఆనంద కౌసల్యాయన్**

తెలుగు

**జనపన లక్ష్మిరెడ్డి**

ప్రచురణ

**ధర్మదీపం ఫౌండేషన్**

C/o. హైదరాబాద్ స్టడీసర్కిల్

1-2-365/25 సి, ఇందిరాపార్క్ క్రాస్ రోడ్స్,

దోమల్‌గూడ, హైదరాబాద్-500 029.

ఫోన్: 040-27635654.

# Bouddha Dharma Darshini

Hindi Original: **Bhadant Anand Kausalyayan**

Telugu Translation: **Janapana Lakshmireddy**

© **Dharmadeepam Foundation**

First Edition : **December 2011**

Publication No : **13**

Copies : **1000**

Price : **₹ 100/-**

For Copies

**Arts & Letters**
C/o Hyderabad Study Circle
1-2-365/25C, Indira Park Cross Roads,
Domalguda, Hyderabad-500 029.

Ph: 040-27635654.

Cover Designing : **Chepuri Ramesh**

Printed at

**Kala Jyothi Process Pvt. Ltd.**
1-1-60/5, RTC 'X' Roads,
Musheerabad, Hyderabad-500 020.
Ph: 040-27645536.

# ముందుమాట

**బు**ద్ధుడు తనకాలం నాటి అనేక ఆలోచనాధోరణులను, విశ్వాసాలను, ఆచరణాత్మక విధానాలను లోతుగా పరిశీలించి, వాటిలోని అహేతుకాంశాలను పరిహరించి, ప్రశస్తమైన, శ్రేయోదాయకమైన ఒక సమాజాన్ని రూపొందించగలిగిన భావచైతన్యాన్ని వ్యాపింపచేశాడు. మానవాళికి శుభాన్ని, సుఖశాంతులను కలిగించే గొప్ప ధర్మాన్ని ఉపదేశించాడు. ఆయన బోధల ఆధారంగా సంస్కృతంలో, పాళీలో, అనేక ఇతర భాషల్లో విపుల సాహిత్యం వెల్లివిరిసింది. కాలాంతరంలో శాఖోపశాఖలుగా విస్తరించిన బౌద్ధధర్మ ఆచారాల్లో, విశ్వాసాల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. ఎన్నో అపోహలు, అస్పష్టతలు చోటు చేసుకున్నాయి. వాటినన్నింటిని తొలగించి బుద్ధుని సద్ధర్మం యొక్క నిజ స్వరూపాన్ని ప్రతిష్ఠింపచేయటం ఎంతైనా అవసరం. ఈ పని బౌద్ధ జగత్తులో అంతర్జాతీయ ఖ్యాతి పొందిన భదంత ఆనంద కౌసల్యాయన్ (5-1-1905 - 22-6-1988) లాంటి బహుముఖ ప్రతిభాసంపన్నుడే చేయగలడనడంలో సందేహం లేదు. ధార్మిక, సామాజికాది విషయాల గురించి ఆయన అనేక రచనలు చేశారు. వీటిలో ఎక్కువగా హిందీలో ఉన్నాయి. డజనుకు మించి భాషలు తెలిసిన భదంత ఆనంద కౌసల్యాయన్ హిందీ, ఇంగ్లీషు, పాళీ, సింహళీ, మరాఠీ, పంజాబీ భాషల్లో చేసిన రచనలు చూసినప్పుడు ఆ భాషలపైన ఆయన ఎంత పట్టు సాధించారో తెలుస్తుంది. 1959 నుంచి 1968 వరకు ఆయన శ్రీలంకలోని విద్యాలంకార విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాధ్యక్షులుగా ఉన్నారు. ఆ తర్వాత నాగపూర్ విశ్వవిద్యాలయంలో సెనేట్ సభ్యులుగా కూడా ఉన్నారు.

భదంత ఆనంద కౌసల్యాయన్ గొప్ప బౌద్ధ పండితుడు, వ్యాఖ్యాత, అనేక బౌద్ధగ్రంథాల టీకా రచయిత, అనువాదకుడేకాక, హిందీ సాహిత్యకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. ఇలా ఈయన వ్యక్తిత్వానికి అనేక కోణాలున్నాయి.

జీవితాన్నంతా బౌద్ధమత ప్రచారానికే అంకితం చేసిన మనీషి ఆయన. బౌద్ధమత తాత్త్విక ప్రాతిపదికకు సంబంధించి చర్చలు జరిగిన అనేక సందర్భాల్లో శ్రోతలు ఆయన్ను ఎన్నో ప్రశ్నలు అడిగేవారు. వాటిని దృష్టిలో ఉంచుకొనే ఆయన ఈ రచన చేసారు.

ప్రశ్నలు - జవాబుల రూపంలో రచించబడినందువల్ల ఈ రచన మరింత ఉపయోగకరంగా, ఆసక్తికరంగా రూపొందింది. రచన పలువురికి ఎంతో ప్రయోజన కరంగా ఉన్నందువల్ల రచయితే చేసిన దీని ఇంగ్లీషు అనువాదం కూడా An Intelligent Man's Guide to Buddhism (Budda Bhoomi Prakashan, Nagpur) పేరుతో వెలువడింది. అతి సులభశైలిలో సాగిన ఈ రచన సాధారణ పాఠకుల అనేక సందేహాలను, జిజ్ఞాసలను తీర్చగలుగుతుందనీ, వారికి బౌద్ధమతం పట్ల ఒక స్పష్టమైన అవగాహన కలిగిస్తుందనీ నమ్ముతూ ఈ తెలుగు అనువాదాన్ని మీ ముందుకు తెస్తున్నాం.

హైదరాబాదు
1-11-2011

**చెన్నూరు ఆంజనేయరెడ్డి**
అధ్యక్షులు
ధర్మదీపం ఫౌండేషన్

# భదంత ఆనంద కౌసల్యాయన్

**భ**దంత ఆనంద కౌసల్యాయన్ 1905 జనవరి 5వ తేదీన, పూర్ణిమనాడు హర్యాణా రాష్ట్రంలో, అంబాలా జిల్లాలోని సోహానా అనే గ్రామంలో జన్మించారు తల్లిదండ్రులు పెట్టిన పేరు హరనామ దాన్. 1920లో అంబాలా కంటోన్మెంటులోని 'హిందు-మహమ్మడన్ హైస్కూల్లో మెట్రిక్ పరీక్ష పాసయ్యారు. వీరి తండ్రి అక్కడ ప్రధానోపాధ్యాయులుగా ఉండేవారు. 1924లో లాలా లాజపతీరాయ్ స్థాపించిన లాహోర్‌లోని 'కౌమీ విద్యాపీఠ్' నుంచి బి.ఎ. పట్టా పొందారు. ఆ సంవత్సరంలోనే మహాపండిట్ రాహుల్ సాంకృత్యాయన్‌తో వీరికి పరిచయమైంది. ఈ పరిచయం తర్వాత గట్టి స్నేహంగా పరిణమించి పలు విధాలుగా ఈయన జీవిత గమనాన్ని ప్రభావితం చేసింది.

రాహుల్‌జీ నుంచి కాషాయ వస్త్రాలు స్వీకరించి ఈయన హరనామదాసు నుంచి విశ్వనాథ పరివ్రాజకుడయ్యారు. 1924 నుంచి 1926 దాకా కాంగడా జిల్లాలో 'అస్పృశు'లుగా భావించబడే సరాండే, డూమనే జాతుల ఉద్ధరణ కార్యక్రమాలు నిర్వహించారు. 1926-27లో పంజాబ్‌లోని బటాలాలో వాల్మీకి ఆశ్రమంలో పనిచేశారు. ఈ సమయంలోనే గౌహతీ కాంగ్రెస్ సమ్మేళనానికి వెళ్ళారు. తర్వాత బౌద్ధ పుణ్యక్షేత్రాలను సందర్శించారు. 1927 డిసెంబరులో మద్రాసు కాంగ్రెస్ సభలకు హాజరయి 1928, జనవరి 5న శ్రీలంకకు వెళ్ళారు. ఆ సంవత్సరంలోనే విద్యాలంకార పరివేణకు చెందిన ధమ్మానంద మహాస్థవిరుని ద్వారా ప్రవ్రజితులై, 1929లో ఉపసంపద పొందారు. 1930-31లో భారతదేశం తిరిగి వచ్చి సారనాథ్‌లోని 'మూలగంధ కుటి' ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న తర్వాత మళ్ళీ శ్రీలంకకు వెళ్ళిపోయారు. 1932లో అనగారిక ధర్మపాల ప్రేరణతో రాహుల్‌జీతో కలిసి ధర్మప్రచారం కోసం ఇంగ్లాండు వెళ్ళారు. 1933లో జర్మనీలో వర్షావాసం చేశారు. 1934లో పినాంగ్‌లో వర్షావాసం చేసి, బ్యాంగ్‌కాక్, రంగూన్‌ల మీదుగా సంవత్సరం చివరన భారతదేశం తిరిగి వచ్చారు.

1935 నుంచి 1948 దాకా సారనాథ్‌ను కేంద్రంగా చేసుకొని భారతదేశంలో ధర్మప్రచారం, సాహిత్య సాధన చేశారు. 1943లో వర్ధాలోని 'రాష్ట్రభాషా ప్రచార సమితి' ప్రధానమంత్రి పదవిని చేపట్టి 1951 దాకా హిందీ ఉన్నతికోసం కృషి చేశారు. ఇప్పుడు

అక్కడున్న 'హిందీ నగర్' ఆయన కృషి ఫలితమే. ఈ కాలంలోనే ఆయన అమూల్యమైన సాహిత్యాన్ని సృష్టించారు కూడా. 1952 నుంచి 1956 దాకా ఆగ్నేయ ఆసియాలోని బౌద్ధ దేశాల్లో పర్యటించారు. 1956లో జరిగిన ధమ్మశాంతి తర్వాత మొత్తం భారతదేశంలో పర్యటించి, ధర్మదీక్ష కార్యక్రమాలు నిర్వహించారు.

1959 నుంచి అక్టోబరు 1968 దాకా శ్రీలంకలోని విద్యాలంకార విశ్వవిద్యాలయంలో హిందీ విభాగాధ్యక్షులుగా పనిచేశారు. 1968 విజయదశమి నాటి నుంచి 1982 దాకా దీక్షాభూమిలో ఉండి 1982-85 మధ్యకాలం మధుకరరావు మేశ్రామ్‌కు చెందిన ధంతోలీ నివాసంలో గడిపారు. 1985 నుంచి జీవితం చివరి రోజుల దాకా బుద్ధభూమిలో ఉంటూ, అక్కడే 1988, జూన్ 22న నిర్వాణం చెందారు.

**జనపన లక్ష్మిరెడ్డి**

# ఆత్మనివేదన

ప్రశ్నలడిగే వ్యక్తి ప్రశ్నలకు జవాబు చెప్పే వ్యక్తి నుంచి ఎక్కువ నేర్చుకుంటాడా లేక ప్రశ్నలకు జవాబు చెప్పే ప్రయత్నం చేసే వ్యక్తి ఒక జిజ్ఞాసువు నుంచి ఎక్కువ నేర్చుకుంటాడా అనేది చర్చనీయాంశమే అవుతుంది. ఈ పంక్తుల రచయిత మాత్రం తను నేర్చుకున్నదంతా కూడా తనలో ఉన్న ప్రశ్నలడిగేవాడి నుంచి లేదా ఇతర జిజ్ఞాసువుల నుంచి నేర్చుకున్నదే అని భావిస్తాడు. ప్రశ్నలు అడిగే సామర్థ్యం జ్ఞానానికి జనని అయితే ఏ విషయంలోనైనా సందేహం పుట్టడం ఆ జ్ఞానానికి జనకుడు.

గత నలభై ఏళ్ళుగా బౌద్ధమతం విషయంలో ఊహాపోహలు ఎన్నో సాగుతూ వచ్చాయి. బహిరంగ సమావేశాల్లో ఉపన్యాసాలు ముగిసిన తర్వాత జిజ్ఞాసతోనో లేక మరో భావంతోనో ఎందరో ప్రశ్నలు అడిగారు. అందరికంటే ఎక్కువ ప్రశ్నలు ఈ రచయిత తనను తనే అడిగాడు. ఈ 'అధ్యయనం'లోని ఎక్కువ భాగం నాలో నేను వేసుకున్న ప్రశ్నలకు సమాధానాలే!

మతం పరలోకం కోసమని మనుషులు సాధారణంగా భావిస్తారు. ఈ 'అధ్యయనం'లో బౌద్ధమతం యొక్క ఇహలోక కోణాన్ని, దృక్పథాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం చేయడం జరిగింది. వెతలపాలైన నేటి మానవులపైన పరలోకం ఎంతగా ఆవహించి ఉందంటే వారి ఇహలోకం వెలవెలపోతూంది! అందుకే ఈ 'అధ్యయనం'లో బౌద్ధమతం యొక్క ఇహలోక సంబంధమైన వ్యాఖ్యే ఉంది. ఇందులో స్వర్గం-నరకం, దేవతలు- ప్రేతయోనులు లాంటివి ఏవీ లేకపోవడం ఎవరికైనా అసంతృప్తి కలిగించవచ్చు. ఎవరి ఇహలోకం సవ్యంగా ఉంటుందో, వారి పరలోకం కూడా సవ్యంగానే ఉంటుంది, ఎవరి ఇహలోకమే దుర్గతి పాలైందో, వారి పరలోకం గురించి ఇక చెప్పేదేముంటుంది? అనే నమ్మకం ఇందులో ఉంది.

విద్యాలంకార విశ్వవిద్యాలయం, కేలనియా (శ్రీలంక)లో నేను అధ్యయనం-అధ్యాపనం చేస్తూ ఉండగా చేసిన రచన ఇది.

15వ దీక్షా మహోత్సవం — -ఆనంద కౌసల్యాయన్

29-9-1971

# బౌద్ధధర్మం

**ప్రశ్న-1: ప్రతి ఒక్కరికి ఏదో ఒక 'మతం' ఉండడం అవసరమా?**

**జవాబు:** ఈ ప్రశ్నకు జవాబు 'మతం' అనే పదానికి మనం ఎలాంటి అర్థం చెబుతాము, అనే దానిపైన ఆధారపడి ఉంటుంది. 'మతం' అనే పదాన్ని దాని విస్తృతమైన అర్థంలో గ్రహించాలి. మనిషి ఆలోచించడం, దానికి అనుగుణంగా నడుచుకోవడం, ఇదే అతని నిజమైన 'మతం.' ఈ నిర్వచనం ప్రకారం కమ్యూనిజాన్ని కూడా ఒక మతంగా పేర్కోవచ్చు. ఎందుచేతనంటే, సంప్రదాయంగా వస్తున్న బౌద్ధమతం, హిందూమతం, క్రైస్తవమతం, ఇస్లాంమతం మొదలైన మతాలు కూడా మనుషులు ఆలోచించడాన్ని బట్టి, తదనుగుణంగా ఆచరించడాన్ని బట్టి ఉజ్జాయింపుగా చేసిన మానవ సమాజ విభాగాలే.

**ప్రశ్న-2: మరి మనం బౌద్ధులని, హిందువులని, క్రైస్తవులనీ, ముసల్మానులని ఎవరిని అనవచ్చు?**

**జవాబు:** ఎవరైతే బుద్ధుడు, ధమ్మం, సంఘం ఈ త్రిరత్నాల శరణుజొచ్చుతారో, బుద్ధుని ఉపదేశాలననుసరించి జీవించే ప్రయత్నం చేస్తారో, వారు బౌద్ధులనబడతారు. హిందువును నిర్వచించడం సులభంకాదు. ఉజ్జాయింపుగా చెప్పాలంటే బౌద్ధుడుగానీ, క్రైస్తవుడుగానీ, ముసల్మానుగానీ, బహుశా జైనుడు, సిక్కుకూడా కాని ప్రతి భారతీయుడు హిందువు, అని చెప్పవచ్చు. భగవంతునిపైన, ఆయన పుత్రుడు ఏసుక్రీస్తు పైన నమ్మకం ఉంచినవాడు క్రైస్తవుడైతే, భగవంతుని పైన, ఆయన ప్రవక్త మహమ్మదు పైన విశ్వాసం ఉంచినవాడు ముసల్మాను.

**ప్రశ్న-3: మరి జైనులని ఎవరినంటారు?**

**జవాబు:** తీర్థంకరుడు పార్శ్వనాథుడు, తీర్థంకరుడు మహావీరుడు, వీరిరువురు చూపిన దారిన నడిచే ప్రయత్నం చేస్తూ బౌద్ధుల్లాంటి శ్రమణ సంస్కృతి (వైదికేతర సంస్కృతి)ని అనుసరించేవారిని జైనులంటారు.

**ప్రశ్న-4: బౌద్ధులు భగవంతుని నమ్మరని అంటారు. మరి బుద్ధున్ని 'బుద్ధ భగవానుడు' అనడంలో అర్థమేముంది?**

**జ:** మానవుల సృష్టికర్తగా చెప్పబడుతున్న, మానవ కల్పితుడైన ఏ భగవంతుణ్ణీ బౌద్ధులు నమ్మరు. వారి దృష్టిలో ఏ మహామానవున్ని మించిన శ్రేష్ఠుడు–జ్యేష్ఠుడు మరెవరూలేరో, ఆ వ్యక్తినే వాళ్ళు 'భగవానుని'గా భావిస్తారు.

**ప్ర–5: ఏసుక్రీస్తు భగవంతుని పుత్రుడు, మానవులెవరూ భగవంతుని పుత్రుడు కాలేరు, అని క్రైస్తవులు అంటారు. మహమ్మదు భగవంతుని ప్రవక్త. మానవ మాత్రులెవ్వరూ భగవంతుని ప్రవక్త కాలేరు, అని ముసల్మానులు అంటారు. ఇక హిందువులు రాముడు, కృష్ణుడు మొదలైనవారు భగవంతుని అవతారాలు, మానవుడైన వాడెవ్వరూ భగవంతుని అవతారం కాలేడు, అని అంటారు. మరి బుద్ధుని ధర్మం ప్రకారం మానవుడెవ్వరూ కూడా 'బుద్ధుడు' కాలేడా?**

**జ:** బుద్ధ ధర్మం ప్రకారం ప్రతి మానవుడు బుద్ధాంకురమే. అంటే ప్రతి మానవుడు బుద్ధుడు కాగలుగుతాడు.

**ప్ర–6: గౌతమబుద్ధుడే మొట్టమొదటి, చిట్టచివరి బుద్ధుడా?**

**జ:** గౌతమ బుద్ధునికి పూర్వం కూడా ఇతరులనేకులు బుద్ధత్వం పొందినట్లు వింటాం. కానీ, వారి చారిత్రికత్వం సందిగ్ధంగానే ఉంది.

**ప్ర–7: మరి బుద్ధుని చారిత్రికత్వంలో సందేహించవలసింది ఏమీలేదా?**

**జ:** ఆయన చారిత్రికత్వం సందేహానికి అతీతమైంది.

**ప్ర–8: సిద్ధార్థ గౌతముడు జన్మించిన స్థలమేది?**

**జ:** జాతక అట్ఠకథ (నిదాన కథ)లో ఇలా ఉంది: "ఆ మహాపురుషుడు జన్మనెత్తడానికి తగిన సమయం గురించి ఆలోచించాడు. ఆ తర్వాత ఏ ద్వీపంలో జన్మించాలి? అని ఆలోచించి బుద్ధులు జంబూ ద్వీపం (భారతదేశం)లోనే జన్మిస్తారు కనుక జంబూ ద్వీపంలోనే జన్మించాలని నిశ్చయించుకున్నాడు. తర్వాత జంబూ ద్వీపం చుట్టుకొలత పదివేల యోజనాలు. బుద్ధులు అందులో ఏ ప్రాంతంలో జన్మిస్తారు? అని ఆలోచించి వివిధ ప్రాంతాలను పరిశీలనగా చూస్తున్నప్పుడు 'మధ్య మండలం'పైన ఆయన దృష్టి నిలిచింది. మధ్యమండలానికి తూర్పున 'కజంగ' అనే ఊరుంది. ఆ తర్వాత పెద్ద–పెద్ద సాలవనాలున్నాయి. ఆ తర్వాత సరిహద్దు ప్రాంతాలున్నాయి. మధ్యలో సలలవతి అనే నది ఉంది. దక్షిణ దిశలో సేతకణ్ణిక అనే ఊరుంది. పడమర దిశలో 'థూన్' అనే

బ్రాహ్మణుల గ్రామం ఉంది. ఉత్తరాన ఉశీరధ్వజమనే పర్వతం ఉంది. ఈ మధ్యమండలం 300 యోజనాలు పొడవు, 250 యోజనాలు వెడల్పు ఉంది. దీని చుట్టుకొలత 900 యోజనాలు. ఈ ప్రాంతంలోనే బుద్ధులు, ప్రత్యేక బుద్ధులు, ఉగ్రశ్రావకులు (ప్రధాన శిష్యులు), మహా శ్రావకులు, చక్రవర్తులు, మహా ప్రతాపవంతులు, ఐశ్వర్యవంతులు అయిన ఇతర క్షత్రియులు, బ్రాహ్మణులు, వైశ్యులు జన్మించారు. అందులోనే ఈ కపిలవస్తు అనే పట్టణం ఉంది. నేనిక్కడే జన్మించాలి. అని నిర్ణయించుకున్నాడు."

ఇక్కడ మొట్టమొదట ఆలోచించవలసిన విషయం___ ఏ ప్రాణి అయినా జన్మించక ముందు తన జన్మ గురించి ఎలా ఆలోచించగలుగుతుంది? అని. ఆలోచించి చూస్తే బుద్ధుడు తాను జన్మించిన కారణంగా ఏ దేశాన్ని, ఏ ప్రాంతాన్ని మహిమాన్వితం చేశాడో, దాని ఘనతను పెంపొందించేందుకే ఈ వ్యాఖ్యానమంతా రాయడం జరిగిందని స్పష్టంగా తెలుస్తుంది. ఇందులో మధ్యమండలం పొడవు 300 యోజనాలు (2400 మైళ్ళు) అని, వెడల్పు 250 యోజనాలు (2000 మైళ్ళు) అని, చుట్టుకొలత 900 యోజనాలు (7200 మైళ్ళు) అని చెప్పడం జరిగింది. ఈ పొడవు-వెడల్పుల కొలతలు అక్షరాలా సత్యమని భావించడానికి వీలులేదు. ఎందుకంటే మధ్యమండలం విషయం అటుంచి నేటి సంపూర్ణ భారతదేశం కూడా అంత విశాలమైంది కాదు. అంతేకాక ఏ ప్రదేశమైనా 300 యోజనాలు పొడవు, 250 యోజనాలు వెడల్పు, ఉంటే దాని చుట్టుకొలత 1100 యోజనాలకు దరిదాపుల్లో ఉండాలి. 900 యోజనాలు కాదు. మొత్తంమీద ఈ వివరణ అంతటి నుంచి మనం గ్రహించ తగింది బుద్ధుడు కపిలవస్తులో జన్మించాడని, ఆ కపిలవస్తు ఇప్పుడు తిలౌరాకోట్, లేదా తౌలిహవా అని పిలువబడుతూందని, అది నేపాల్ లోతట్టు ప్రాంతానికి 2 మైళ్ళు ఉత్తర దిశగా ఉందని, ఆ కపిలవస్తు మధ్య మండలంలో ఉండేదని, నేటి కంకజోల్, (బీహార్‌లోని సంథాల్ పరగణాజిల్లా)ను దాని తూర్పు సరిహద్దుగా భావించవచ్చునని, దాని మధ్యలో నేటి సిలఈ నది (హజారీబాగ్, మేదనీపుర్ జిల్లాలు) ఉండేదని, దాని దక్షిణ భాగంలో హజారీబాగ్‌కు చెందిన సేతకణ్ణిక అనే ఒక ఊరు ఉండేదని, దాని పడమర సరిహద్దులో హర్యానా ప్రదేశ్, కర్నాల్ జిల్లాలో ఉన్న థానేసర్ అనే ఊరుండేదని, దాని ఉత్తర సరిహద్దుగా ఉశీరధ్వజ అనే హిమాలయాలకు సంబంధించిన ఒక పర్వత ప్రాంతం ఉండేదని మాత్రమే.

**ప్ర-9: గౌతమ బుద్ధుడు ఏ కులంలో జన్మించాడు?**

**జ:** ఈ విషయంలో కూడా నిదాన అట్ఠకథలో ఇలా ఉంది: "అప్పుడు ఆ మహాపురుషుడు తన కులాన్ని గురించి ఇలా ఆలోచించాడు___ బుద్ధులు వైశ్యకులంలో

గానీ, శూద్రకులంలో గానీ జన్మించరు. లోకమాన్యత పొందిన బ్రాహ్మణ, క్షత్రియ కులాల్లోనే జన్మిస్తారు. ఈ సమయంలో క్షత్రియకులమే లోకమాన్యత పొంది ఉంది. (అందువల్ల) ఈ కులంలోనే జన్మిస్తాను."

ఎవరు చేసిందైనా, ఈ కల్పన అంతా కులతత్వ దోషం అంటిన కల్పనే అని మనకు స్పష్టంగా తెలుస్తూంది. ఇందులో మొదట లేవదీయవలసిన అభ్యంతరం ఏ ప్రాణి అయినా జన్మించేముందు తన జన్మ గురించి ఎలా ఆలోచించగలుగుతుంది? అని. మరోటి, ఏ మహా పురుషుడైనా కేవలం శ్రేష్ఠమైన కులాల్లోనే జన్మించాలనే కోరికకు మనసులో ఎలా తావివ్వ గలుగుతాడు? అని. ప్రపంచంలో ఎందరో మహా పురుషులు సమాజ గౌరవం పొందిన ఉన్నత కులాల్లో జన్మించలేదు. కులతత్వ దూషితమైన ఈ కల్పన ఏ విధంగానూ అంగీకరించతగింది కాదు. ఇందులో స్వీకరించవలసిన విషయం___ సిద్ధార్థుడు క్షత్రియ కులంలో జన్మించాడని మాత్రమే.

**ప్ర-10: సిద్ధార్థ గౌతముని తల్లిదండ్రులెవరు?**

**జ:** జాతక (నిదాన) అట్ఠకథలో ఆ తర్వాత ఇలా ఉంది___ "తండ్రిని గురించి ఆలోచిస్తూ 'శుద్ధోధనుడు అనే రాజు నా తండ్రి అవుతాడు' అని నిశ్చయించుకున్నాడు. తర్వాత తల్లిని గురించి ఆలోచించి ఇలా నిశ్చయించుకున్నాడు___ "బుద్ధుల తల్లి చంచల స్వభావం కలదిగా, మదిరాపానం చేసేదిగా ఉండదు. లక్షల కల్పాలుగా (బ్రహ్మదేవుని జీవితంలో ఒక రోజును ఒక కల్పమంటారు. ఒక కల్పం 1000 మహాయుగాలకు లేదా 432 కోట్ల మానవ సంవత్సరాలకు సమానం.) (దానాది) పారమితలు[1] పూర్తి చేసిందీ, పుట్టినప్పటినుంచీ అఖండ సదాచార పరాయణురాలు అయి ఉంటుంది. మహామాయ అనే ఈ దేవి అలాంటిదే. ఈమే నా తల్లి అవుతుంది. ఈమె ఇప్పటినుంచి పది నెలల ఏడు దినాలవరకు జీవిస్తుంది."

ఇక్కడ కూడా 'ఎవరైనా పుట్టక ముందు తన తల్లిదండ్రులను ఎలా ఎంపిక చేసుకోగలుగుతారు?' అనే ప్రశ్న లేవనెత్తడం సమంజసమే. మరో విషయం, ఇందులో ఉన్న "శుద్ధోధనుడు అనే 'రాజు' నా తండ్రి అవుతాడు." అనే మాటలో 'రాజు' అనే

1. 'పారమిత' అంటే పూర్ణత్వం లేక ఉత్కృష్టత అని అర్థం. అది ఈ ఆరు విధాలైందిగా చెప్పబడుతుంది___ దానం, శీలం, శాంతి, వీర్యం, ధ్యానం, ప్రజ్ఞ. కొందరు సత్యం, అధిష్ఠానం, మైత్రి, ఉపేక్ష ఈ నాలుగింటిని కూడా చేర్చి వీటి సంఖ్య పది అని కూడా చెప్తారు (అనువాదకుడు).

పదానికి మనమిప్పుడు చెప్పుకునే అర్థం లేదు, అని మాత్రమే గ్రహించాలి. త్రిపిటకాల్లో ఎక్కడేగానీ శుద్ధోధనుని రాజుగా చెప్పడం జరగలేదు. తండ్రి ఎంపిక విషయంలో అడిగిన ప్రశ్నే తల్లి ఎంపిక విషయంలో కూడా అడగవచ్చు. ఏ ప్రాణి అయినా పుట్టకముందు తన తల్లిని ఎంపిక చేసుకోగలుగుతుందా? అని. మొత్తానికి ఈ వర్ణనలోనుంచి సిద్ధార్థ గౌతముని తల్లి మహామాయాదేవి సదాచార పరాయణురాలై ఉంటుందనే విషయాన్ని మాత్రం మనం స్వీకరించవచ్చు. ఎందుచేతనంటే ఫలాన్ని చూసే వృక్షాన్ని గుర్తించడం జరుగుతుంది కాబట్టి. పిల్లలు తమ తల్లిదండ్రుల మానసిక–శారీరక సంప్రదాయాన్ని కొనసాగించే వారుగానే ఉంటారు. అయితే పాపం మాహామాయాదేవి సిద్దార్థ గౌతముడు జన్మించిన తర్వాత ఏడవ రోజే శరీరత్యాగం చేసింది. ఆమె కేవలం ఒక అమాయక శిశువుకు జన్మనిచ్చిన తల్లిగానే ఉండిపోయింది.

**ప్ర–11: సిద్ధార్థ గౌతముని పెంచి పోషించిందెవరు?**

**జవాబు:** మహామాయ చెల్లెలు, శుద్ధోధనుని రెండవ భార్య అయిన మహా ప్రజాపతి గౌతమి ఆయన్ను పెంచి పోషించింది.

**ప్ర–12: మహాపురుషుల పుట్టుకతో పాటు కొన్ని అలౌకిక సంఘటనలు జరిగినట్లు చెప్పడం జరుగుతుంది. సిద్ధార్థ గౌతముని పుట్టుకకు సంబంధించిన అలౌకిక సంఘటనలు కూడా ఏమైనా ఉన్నాయా?**

**జ:** ఉన్నాయి. ప్రాచీన కాలానికి చెందినవారే కాదు, మధ్యయుగాలకు (Midde Agesకు) చెందినవారైనా వారి పుట్టుకకు సంబంధించిన ఏవో కొన్ని అలౌకిక సంఘటనలు లేని మహా పురుషుడు సాధారణంగా ఎవరూ ఉండరు. సిద్ధార్థ గౌతముని పుట్టుక ఇందుకు మినహాయింపు కాదు. జాతక (నిదాన) అట్ఠకథలో ఆ తర్వాత ఇలా ఉంది___ "ఆ రోజుల్లో కపిలవస్తు నగరంలో ఆషాఢ మహోత్సవం జరుగుతూంది. ప్రజలు ఉత్సవం జరుపుకుంటున్నారు. పూర్ణిమకు ఏడు రోజులు ముందునుంచే మహా మాయదేవి మద్యపాన విరతురాలై, వస్త్రమాలాలంకృత అయి, ఆరు రోజులు ఉత్సవంలో పాల్గొంది. ఏడవ రోజు వేకువ జామున్నే లేచి, సుగంధ జలంతో స్నానం చేసి, నాలుగు లక్షల నాణాలు దానంచేసి... సర్వాలంకారభూషిత అయి, ఉత్తమమైన అన్నపానాలు స్వీకరించి, ఉపోసథ (వ్రతం) నియమాలను పాటించి ఆకర్షణీయంగా అలంకరించిన శయనాగారంలో, అందమైన పాన్పుపైన నిద్రిస్తున్నప్పుడు ఆమె ఈ స్వప్నం చూసింది___

"బోధిసత్వుడు అందమైన తెల్లని ఏనుగు రూపంలో వెండిలాగా మెరిసే తొండంతో ఒక శ్వేత కమలాన్ని పట్టుకొని మధుర ఘీంకారనాదం చేసి ఆమె పొత్తి కడుపు కుడి

పార్శ్వం నుంచి ఆమె గర్భంలోకి ప్రవేశించాడు. ఈ విధంగా (బోధిసత్వుడు) ఉత్తరాషాఢ నక్షత్రంలో ఆమె గర్భంలో ప్రవేశించాడు.”

సాధారణంగా కలలు మనిషి తాను చూసిన, విన్న, అనుభవించిన, ఊహించిన విషయాల కలగాపులగంగా ఉంటాయి. ఒక తెల్ల ఏనుగు మహా మాయాదేవి గర్భంలో ప్రవేశించిందని చెప్పడం ఆమె గర్భధారణకు, సిద్ధార్థుని పుట్టుకకు, అలౌకికతను సంతరించి పెట్టడం కోసమే అయి ఉంటుంది.

ఈ స్వప్నాన్ని గురించే ఆ తర్వాత ఇలా ఉంది____

“మరుసటి రోజు నిద్ర మేల్కొని మహామాయా దేవి తన కల గురించి రాజుకు చెప్పింది. రాజు అరవైనాలుగు మంది ప్రధాన బ్రాహ్మణులను పిలిపించి, ఆవు పేడతో అలికిన, వడ్లపేలాలు, మొదలైనవాటితో మంగళమయం చేసిన భూమిపైన అమూల్యమైన ఆసనాలు పరిపించి, అక్కడ కూర్చుండబెట్టిన బ్రాహ్మణులకు బంగారు, వెండి మూతలున్న బంగారు, వెండి పాత్రల్లో నెయ్యి, తేనె, చక్కెరతో చేసిన రుచికరమైన పాయసం అర్పించాడు. తర్వాత వారికి కొత్త బట్టలు, గోవులు మొదలైనవి దానంగా ఇచ్చాడు. చివరన ‘స్వప్నఫలం ఎలా ఉంటుంది?’ అని వారిని అడిగాడు.”

బ్రాహ్మణులు ఇలా అన్నారు: “మహారాజా! చింతించకండి. మీ దేవేరి గర్భకోశంలో గర్భధారణ జరిగింది. ఈ గర్భం బాలకుడు. బాలిక కాదు. మీకు పుత్రుడు జన్మిస్తాడు. ఇతడు గృహస్థుగా ఉంటే చక్రవర్తి అవుతాడు, అలాకాక పరివ్రాజకుడైతే మహాజ్ఞాని అయిన బుద్ధుడవుతాడు.”

ఇదంతా చదివి ఏమనిపిస్తూందంటే చపల చిత్తుడైన ఒక అట్ఠకథా కారునికి బ్రాహ్మణవాద కార్టూనొకటి గీయాలని అనిపించినప్పుడు, అతని కలం నుంచి ఈ పంక్తులు వెలవడి ఉంటాయని. లేకుంటే కేవలం స్వప్నఫలం అడగడానికి అరవైనాలుగు మంది బ్రాహ్మణులకు బంగారు, వెండి మూతలతో కప్పిన, నెయ్యి, తేనె, చక్కెరతో చేసిన పాయసంతో నిండిన బంగారు, వెండి పాత్రలు సమర్పించడం, కొత్తబట్టలు, గోవులు దానంగా ఇవ్వడం నమ్మదగిందా? పాపం శుద్ధోధనునికి ఈ స్వప్నఫలం తెలుసుకోవడం ఎంత ఖర్చుతో కూడిన పనిగా పరిణమించిందో! సిద్ధార్థుని భవిష్యత్తు గురించి “గృహస్థుగా ఉంటే చక్రవర్తి అవుతాడు, పరివ్రాజకుడైతే మహాజ్ఞాని అయిన బుద్ధుడవుతాడు” అని బ్రాహ్మణులతో చెప్పించిన మాటల ద్వారా మానవునికి భూమండల చక్రవర్తి కావడాన్ని మించిన జీవితోద్దేశ్యం ఏదీ లేదని భావించే కాలం నాటి రచన ఇది, అని తెలుస్తుంది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Bouddha+Dharma+Darshini**

* * *